సాక్షి
నిర్మల్
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



గరిష్టం/కనిష్టం
35.5 /20.4

**వాతావరణం**
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

### నేడు రథాలగుడిలో పల్లకియాత్ర

**నిర్మల్:** జిల్లా కేంద్రంలోని చారిత్రక రథాలగుడిలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పల్లకియాత్ర నిర్వహించనున్నట్లు వంశ పారంపర్య పూజారులు తెలిపారు. కాశీ విశాలాక్షి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఉత్సవ విగ్రహాలతో సాయంత్రం 6 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రతీ మహాశివరాత్రికి నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.


బ్రహ్మపురి రథాలగుడిలో కొలువైన విశ్వేశ్వరుడు

## న్యూస్‌రీల్

### సౌకర్యాలు కల్పించాలి


పరిసరాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**నిర్మల్‌టౌన్:** శివరాత్రి రోజు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌లో గల ఓంకారేశ్వర ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించి సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా స్ట్రీట్ లైట్లు, నీటి సదుపాయం, క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

### ఏసీబీకి చిక్కిన ఎక్సైజ్ ఎస్సై, కానిస్టేబుల్

- రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం..


పట్టుబడిన ఎక్సైజ్ ఎస్సై, కానిస్టేబుల్

**భైంసాటౌన్:** లంచం తీసుకుంటూ ఓ ఎక్సైజ్ ఎస్సై, కానిస్టేబుల్ ఏసీబీకి పట్టుబడిన ఘటన భైంసా ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి... భైంసా మండలం కామోల్‌కు చెందిన సుభాష్‌గౌడ్ అనే కల్లు వ్యాపారికి, అదే గ్రామానికి చెందిన మరో కల్లు వ్యాపారికి కల్లు విక్రయాల విషయమై గొడవ తలెత్తింది. దీంతో ఈ విషయం పోలీసుస్టేషన్ వరకు వెళ్లింది. ఈ క్రమంలో సమస్య పరిష్కరించాలని సుభాష్‌గౌడ్ ఎక్సైజ్ ఎస్సై నిర్మలను సంప్రదించాడు. ఆమె కానిస్టేబుల్ సుజాత ద్వారా రూ.10 వేలు డిమాండ్ చేశారు. దీంతో సుభాష్‌గౌడ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పథకం ప్రకారం కానిస్టేబుల్ సుజాతకు డబ్బు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీలు విజయ్‌కుమార్, రమణమూర్తి, సీఐలు కిరణ్, స్వామి, సిబ్బంది ఉన్నారు.

### ఖేలో ఇండియా పోటీలకు జిల్లా విద్యార్థి


వార్లె దిలీప్

**భైంసాటౌన్:** అఖిల భారత ఖేలో ఇండియా యోగా పోటీలకు తెలంగాణ నుంచి జిల్లా విద్యార్థి వార్లే దిలీప్ ఎంపికైనట్లు యోగా గురువు మల్లేశ్ తెలిపారు. తానూర్ మండలం హిప్నెల్లికి చెందిన దిలీప్ బెంగళూరులోని వ్యాస యూనివర్సిటీలో బీఎస్సీ యోగా చేస్తున్నారు. ఇటీవల భువనేశ్వర్‌లో జరిగిన యోగా పోటీల్లో యూనివర్సిటీ తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చాడు. దీంతో మార్చిలో జమ్మూలో జరిగే ఖేలో ఇండియా జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి యోగాతోపాటు, ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**కుంటాల:** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని టీపీడీఎంఏ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి బోయ సాయిలు డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఇప్పటి వరకు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో రెండుసార్లు చర్చలు జరిపినా ఇంతవరకు స్పందన లేదన్నారు. దీంతో భవనాల అద్దె, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు జీతాలు చెల్లించని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

### అడవిలో మంటలు


అడవిలో చెలరేగిన మంటలు

**దస్తురాబాద్:** తెల్లవారితే మహాశివరాత్రి.. శివాలయాలను ముస్తాబు చేశారు. చీకటి వెలుతురులో ఎర్రటి శివలింగం ఆకృతి అడవి గుట్టపై కనబడింది. అంతే ఇంకేముంది రోడ్డు నుంచి వెళ్లే వారు సెల్ ఫోన్‌లో బంధించడం మొదలు పెట్టారు. అయితే అది గుడికి వేసిన విద్యుత్ వెలుగులు కాదు. అటవీ ప్రాంతం మంగళవారం రాత్రి మంటలు అంటుకుని.. సమీపంలోని గుడి వరకు విస్తరించాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఎఫ్ఎస్‌వో కింగ్ ఫిషర్ పర్యవేక్షిస్తున్నారు.

# అంతా శివమయం

శివ భక్తులు ఎదురుచూస్తున్న మహాశివరాత్రి పర్వదినానికి గడియలు సమీపించాయి. ఇప్పటికే శివాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబయ్యాయి. పండగ రోజున ఓం నమః శివాయ, హరహర మహాదేవ శంభో శంకర మంత్రాలతో శివాలయాలు మార్మోగుతాయి. ముక్కంటిగా భక్తకోటితో నిరంతరం పూజలందుకుంటున్న అభిషేక ప్రియుడి నామస్మరణతో మహాశివరాత్రి పండుగను జరుపుకోవడానికి భక్తులు సిద్ధమయ్యారు. మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శివాలయాలపై ప్రత్యేక కథనం.


జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌లో ముస్తాబైన ఓంకారేశ్వర ఆలయం


ఓంకారేశ్వరాలయంలో కొలువైన శివపార్వతులు

### ఓలాదీశ్వరుని ప్రత్యేకత..!


ఓలా ఆలయంలోని శివలింగం

**కుంటాల:** మండలంలోని ఓలా, దౌనెల్లి శివాలయం, సూర్యాపూర్ శ్రీరాజరాజేశ్వరాలయం, కుంటాల ఉమామహేశ్వర, మహాదేవుడు, ఆత్మలింగ ఆలయాలను ముస్తాబు చేశారు. ఓలా గ్రామంలో 150 ఏళ్ల క్రితం రాతి కట్టడంతో శివాలయాన్ని నిర్మించారు. ఆలయంలో లింగమూర్తిని ప్రతిష్టించారు. ఆలయం గర్భగుడి నుంచి సొరంగం మార్గం ఉందని పెద్దలు చెబుతుంటారు. ఇక్కడి నుంచి బాసరలోని గోదావరి, కాశీకి వెళ్లి మునులు స్నానం ఆచరించేవారని చెబుతారు. సూర్యాపూర్ రాజరాజేశ్వరుడు మహారాష్ట్రలో సరిహద్దు ప్రాంతంలో వాగు, చెరువు సమీపాన కొలువుదీరి ఉన్నాడు.

### పాపహరేశ్వరుని దర్శనం... సర్వపాపహరణం

**దిలావర్‌పూర్:** సహ్యాద్రిపర్వత శ్రేణుల్లోని 'కదిలి' లోయలో కొలువుదీరి ఉన్న శ్రీమాతాన్నపూర్ణ సహిత పాపహరేశ్వరాలయాన్ని దర్శించుకుంటే సర్వపాపాలు హరించబడతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. మాడేగాం గ్రామ పంచాయతీ పరిధిలోని కదిలి గ్రామ పరిసర అటవీప్రాంతంలో వెలిసిందే శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం. సహ్యాద్రి కొండల్లో మాతృహత్యాపాపం నుంచి విముక్తి పొందేందుకు పరశురాముడు ఇక్కడ స్వయంగా శివలింగాన్ని ప్రతిష్టించి పూజించాడని ఆలయ చరిత్ర చెబుతోంది. ప్రకృతి అందాల నడుమ వెలసిన పాపహరేశ్వర స్వామి చెంతనే శ్రీమాతన్నపూర్ణేశ్వరీదేవి వెలిసింది.

**కదిలె శివలింగం..**
గర్భగుడిలోని శివలింగం భక్తితో పరిశీలిస్తే కదులుతున్నట్లు కనిపిస్తుంది. ఆలయ ప్రాంగణంలో ఒకే కాండంలో 18 వృక్షాలు మిళితమైన వట వృక్షం


ఆలయంలో స్వామివారు

ఆత్తకోడళ్ళ గుండాలు, సీతమ్మ అల్లుబండ, అన్నపూర్ణమాత, ఆలయ ద్వారపాలకులు సప్త రుషుల ధ్యాన మందిరం, నందీశ్వరుడు, ఆవునోటి ద్వారా కోనేరులో చేరే నీరు వంటి వి ఇచ్చట భక్తులను ఆకట్టుకుంటున్నాయి.


కొలువుదీరిన ఆదియోగి, నంది విగ్రహాలు

### జాతరకు సిద్ధమైన మహాదేవుడు

**లక్ష్మణచాంద:** బాబాపూర్ గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం మహాదేవుని జాతరకు సిద్ధమైంది. రెండవ వేములవాడగా బాబాపూర్ రాజేశ్వరుడు ప్రసిద్ధిగాంచాడు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బాబాపూర్ గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయం వద్దకు బుధవారం జిల్లాలోని వివిధ మండలాల ఉండి వేలాది మంది భక్తులు వచ్చి ఉపవాస దీక్షలు స్వీకరిస్తారు. రాత్రంతా జాగరణ చేస్తారు. బాబాపూర్ గ్రామంలో స్వయంభుగా వెలసిన శివలింగం ఉంది. దీంతో ఇక్కడకు వచ్చి పూజలు చేస్తే తాము కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

**కోడెలు సమర్పించడం ప్రత్యేకత...**
వేములవాడ తర్వాత బాబాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో భక్తులు కోడెలు సమర్పిస్తారు. సామి కోర్కెలు తీరిస్తే కోడెను సమర్పిస్తామని మొక్కుకుని ఇలా చేస్తారు.

### గొడిసిర్యాల రాజన్న...


గొడిసిర్యాల రాజన్న ఆలయం....

**దస్తురాబాద్:** కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా గోడిసిర్యాల రాజన్న భక్తుల విశేష పూజలు అందుకుంటున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఉత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినాన రాత్రి శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 27న కుంకుమ పూజలు, సాముహిక హోమం, 28న అన్నపూజ, మల్లన్న, పోచమ్మ బోనాలు నిర్వహిస్తారు. గోడిసిర్యాల రాజన్న ఆలయంలో అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవం సమయంలో నాగుపాము దర్శనం భక్తులకు ప్రత్యేక ఆకర్షణ. ఇక గోడిసిర్యాల రాజన్న ఆలయంలో ముడుపు కట్టివెళ్తే కోరిక తీరుతుందని భక్తుల ప్రాగాఢ విశ్వాసం. ఆలయ ప్రాంగణంలోని రావి, మేడి, మామిడి చెట్లు భక్తుల ముడుపులతో నిండి పోతాయి.

### పార్డి(బి)లో జాతర


మందిరంలోని దేవతామూర్తులు

**కుభీర్:** మండలంలోని పార్డి(బి) రాజరాజేశ్వర మందిరం మహాశివరాత్రి సందర్భంగా జాతర నిర్వహిస్తారు. బుధవారం మందిరంలో పూజలు, అభిషేకాలు జరుగుతాయి. గురువారం దేవతా మూర్తులకు జోడువాగులో స్నానం చేయిస్తారు. అదే రోజు రాత్రి కళ్యాణం నిర్వహిస్తారు. శుక్రవారం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. శనివారం అంబళ్ల గ్రామంలోని మహిళలందరూ అంబళ్ల బుడ్లతో వచ్చి దేవునికి నైవేద్యం సమర్పిస్తారు. ఆదివారం కుస్తీపోటీలు జరుగుతాయి.

**పార్వతీల వ్యవస్థ..**
గతంలో భక్తులు తమ కూతుళ్లకు దేవునితో పెళ్లి చేసి అక్కడే వదిలిపెట్టేవారు. పార్వతిగా ఉన్న మహిళ దేవుని సేవచేస్తూ భక్తులకు మార్గదర్శనం చేసేవారు. ఆమె చనిపోతే అక్కడే సమాధి చేసేవారు. ఇక్కడ ఆరుగురు మహిళలు పార్వతిలుగా మారి చనిపోయారు. చివరి పార్వతమ్మ 2011లో చనిపోయింది. ఆ తరువాత పార్వతమ్మగా ఎవరూ మారలేదు.

### కోరికలు తీర్చే బ్రహ్మేశ్వరుడు..


కన్నపూర్ బ్రహ్మేశ్వరాలయంలోని శివలింగం

**లోకేశ్వరం:** భక్తుల పాలిట కొంగు బంగారం విరాజిల్లుతున్నాడు కన్నాపూర్ సత్య శివుడు. బ్రహ్మేశ్వరాలయం నిత్య పూజలతో వెలుగొందుతోంది. కాకతీయుల కాలంలో గణపతి దేవుడు బ్రహ్మేశ్వరాలయాన్ని రాతితో నిర్మించారు. ఇక్కడ ప్రత్యేకత గోదావరి నది ఆలయ సమీపంలో ఉత్తరం దిక్కుగా ప్రవహిస్తే ఉత్తర వాహినిగా పేరు గాంచింది.

# పకడ్బందీగా బ్యాలెట్ బాక్సుల ర్యాండమైజేషన్

**నిర్మల్‌చైన్‌గేట్:** బ్యాలెట్ బాక్సుల ర్యాండమైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వినియోగించే బ్యాలెట్ బాక్సుల ర్యాండమైజేషన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. అదనపు కలెక్టర్‌తో కలిసి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి అందించే సామగ్రిని పరిశీలించారు. 25 మంది సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని రవాణా చేసే వాహనాలన్నింటికీ జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో కండీషన్‌లో ఉన్న వాహనాలను వినియోగించాలన్నారు. అదనంగా వాహనాలను, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, తహసీల్దార్ రాజు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్డీవో

### వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలి

**నిర్మల్‌చైన్‌గేట్:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలలో వీధి కుక్కలతో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటి నియంత్రణకు మున్సిపల్, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీధి కుక్కలను పట్టుకునే బృందాలను ఏర్పాటు చేసి, వాటిని పునరావాస కేంద్రాలకు తరలించి, జనాభా నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలని ఆదేశించారు. అనంతరం వాటిని జనావాసాలకు దూరంగా రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచిపెట్టాలన్నారు. వీధి కుక్కల పట్టివేతకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలన్నారు. కుక్క కాటుతో ఆస్పత్రులకు వచ్చే బాధితులకు వ్యాక్సిన్లు వేసి, మెరుగైన చికిత్స అందించాలన్నారు. వేసవిలో నీరు దొరకక కుక్కలు మరింత ఆగ్రహంతో ఉంటాయని, వాటికి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఈఈ టి.శంకరయ్య, పశుసంవర్ధక అధికారి బాలిక్ అహ్మద్, నిర్మల్ మున్సిపల్ డీఈ హరిభువన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్ పాల్గొన్నారు.

# ఎన్నికల జాగారం

- శివరాత్రి తెల్లారే ఎమ్మెల్సీ పోలింగ్
- పట్టభద్రులు, టీచర్ అభ్యర్థుల ఆరాటం
- ప్రచారం ముగిసి తెరవెనుక మంత్రాంగం


| ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు |
|---|
| పట్టభద్రులు 3,55,159 |
| టీచర్లు 27,088 |

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** మెదక్–కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుది అంకానికి చేరుకుంది. పోలింగ్‌కు 48గంటల ముందే ప్రచారం నిలిపి వేయాల్సి ఉండడంతో తెరవెనుక అభ్యర్థుల మంత్రాంగం మొదలైంది. నాలుగు పాత జిల్లాల్లోని మొత్తం 42అసెంబ్లీ స్థానాల పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఈసారి సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పోటీలో ఉన్న వారందరూ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఓటర్ల మొగ్గుపై ఆసక్తి కొనసాగుతోంది. తమ అభ్యర్థుల విజయం కోసం రాష్ట్ర అగ్రనాయకత్వం ప్రచారం చేయడంతో గత ఎన్నికల కంటే ఈసారి మరింత దూకుడుగా అభ్యర్థులు తలపడుతున్నారు. ప్రచారంలో ఒకరిని మించి మరొకరు హామీలు ఇస్తూ ఓటర్లకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. నేడు శివరాత్రి పండుగ ముగిసి, గురువారం ఉదయం 8నుంచే బ్యాలెట్ పేపర్‌పై ప్రాధాన్యత క్రమాన్ని ఓటర్లు వేయడం మొదలవుతుంది. దీంతో అభ్యర్థులు ఎన్నికల జాగారం చేయాల్సి వస్తోంది.

**టీచర్ల స్థానానికి హోరాహోరీ**
ఉపాధ్యాయ స్థానానికి మొత్తం 15మంది బరిలో ఉండగా, ఇందులో బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్టీయూ టీఎస్ నుంచి వంగ మహేందర్ రెడ్డి, తాజా మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయ సంఘాల్లో చురుగ్గా ఉన్న పీఆర్‌టీయూ ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, టీఎస్‌సీపీఎస్ఈ యూనియన్ బలపర్చిన తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డితో సహా స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. సీపీఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు, 317జీవో, డీఏలు మెడికల్ రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్, పే స్కేల్, పదోన్నతుల సమస్యలే ప్రచారంలో చర్చకు వచ్చాయి. అందరూ హామీలే ఇచ్చినప్పటికీ టీచర్లు ఎవరికి పట్టం కడుతారనే ఆసక్తి నెలకొంది. గతంలో మద్దతు తెలిపిన సంఘ సభ్యులందరూ ఒకే అభ్యర్థికి ఓట్లు వేసిన దాఖలాలు లేవు. చాప కింద నీరులా కొందరు అభ్యర్థులు తెరవెనుక మంత్రాంగం నడిపించి ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మకంగా వెళ్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయా ఓటర్లకు తాయిలాలు అందే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంకా విందులు నడుస్తున్నాయి.

**పట్టభద్రుల అభ్యర్థులు**


పూట్కూరి నరేందర్ రెడ్డి


అంజిరెడ్డి


ప్రసన్న హరికృష్ణ


బక్క జడ్సన్

**టీచర్ల అభ్యర్థులు**


మల్క కొమురయ్య


వంగ మహేందర్‌రెడ్డి


తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి


కూర రఘోత్తంరెడ్డి

### పట్టభద్రుల ప్రసన్నం కోసం

కాంగ్రెస్ పార్టీ నుంచి నరేందర్‌రెడ్డి, బీజేపీ మద్దతుతో అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరిక్రిష్ణతో సహా మొత్తం 56మంది బరిలో ఉన్నారు. తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు స్థానిక నాయకులు చెమటోడుస్తున్నారు. బీజేపీ నుంచి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు ప్రచారం చేశారు. బీఎస్పీ నుంచి పోటీలో ఉన్న ప్రసన్న హరిక్రిష్ణ బీసీ నినాదంతో ముందుకు వస్తున్నారు. వీరితోపాటు బక్క జడ్సన్ పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పటికే బహిరంగ సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. అంతేకాక ఎవరికివారు సామాజిక మాధ్యమాలు, ఫోన్లు, మేసేజ్‌లు, వాట్సాప్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా ముగ్గురి మధ్యే పోటీ నెలకొనడంతో పట్టభద్రులు తమ ప్రాధాన్యతను ఎలా వ్యక్తపరుస్తారనేది ఆసక్తిగా మారింది. పట్టభద్రుల ప్రసన్నం కోసం చివరి అస్త్రంగా నగదు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా సమాచారం.

# రంజాన్ ప్రశాంతంగా జరుపుకోవాలి

**నిర్మల్‌టౌన్:** శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగ నిర్వహించుకోవాలని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా సూచించారు. నిర్మల్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ముస్లిం మత పెద్దలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో అందరూ సంయమనం పాటించాలన్నారు. ఘర్షణలు, గొడవలు జరగకుండా మత పెద్దలు చర్యలు చేపట్టాలని సూచించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పెట్టే పోస్టులను నమ్మవద్దని తెలిపారు. ఎలాంటి సందేహం ఉన్న పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, పట్టణ మసీద్‌లా మేనేజింగ్ అధ్యక్ష, కార్యదర్శులు తాజా మాజీ కౌన్సిలర్లు తౌహీద్ ఉద్దీన్, ఇమ్రాన్ ఉల్లా, అబ్దుల్ మతిన్, గుల్జార్ మస్జిద్ అధ్యక్షుడు సయ్యద్ బషీర్ అలీ, మాజీ వైస్ చైర్మన్ అజీమ్ బిన్ యహీయా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

# పన్నుల వసూలు వేగవంతం చేయాలి

**నిర్మల్‌చైన్‌గేట్:** జిల్లాలోని మున్సిపాలిటీల్లో అన్నిరకాల పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీల వారీగా పన్ను వసూలు లక్ష్యం, ఇప్పటి వరకు పూర్తి చేసిన పన్నుల వివరాలు మున్సిపాలిటీల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెడ్ నోటీసులు జారీ చేసిన వారి వివరాలపై ఆరా తీశారు. నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలలో వాణిజ్య, నీటి, వ్యాపార ప్రకటనల పన్నుల వసూలు వందశాతం పూర్తి చేయాలన్నారు. ఎక్కువ మొత్తంలో పన్నులు కట్టకుండా ఉన్నవారి జాబితాను సిద్ధం చేసి, అందులోని మొదటి వంద మందికి రెడ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ వాణిజ్య సముదాయాల అద్దెలు వసూలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు జాదవ్ కృష్ణ, రాజేశ్‌కుమార్, నిర్మల్ మున్సిపల్ డీఈ హరిభువన్, అధికారులు పాల్గొన్నారు.

# శివాజీ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి

**తానూరు:** ప్రతి ఒక్కరూ శివాజీ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే రామారావ్‌పటేల్ సూచించారు. కళ్యాణి గ్రామంలో మంగళవారం నిర్వహించిన శివాజీమహరాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ శివాజీ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్, శివాజీ పటేల్, చక్రధర్ పటేల్, చిన్నారెడ్డి, సోమ్‌నాథ్, బాలాజీ ఆయా గ్రామాల కార్యకర్తలు, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


శివాజీమహరాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

## క్లుప్తంగా

### ఆగస్త్యకూడం అధిరోహించిన చెన్నూర్ యువకుడు


ఆగస్త్యకూడం(శిఖరం) ఎక్కిన సూరజ్

చెన్నూర్: పట్టణానికి చెందిన యువకుడు మంచాల సూరజ్.. ఆగస్త్యకూడం (శిఖరం) అధిరోహించాడు. మంచాల రాజబాపు–పద్మజ దంపతుల కుమారుడు సూరజ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈయన కేరళలోని తిరువనంతపురానికి 60 కి.మీ దూరంలో ఆగస్త్యకూడం(శిఖరం) 50 మీటర్ల ఎత్తును మూడురోజుల్లో ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. ఈ ట్రెక్కింగ్ జనవరి నుంచి ఏప్రిల్ వరకు కొనసాగుతుంది. శిఖరానికి ఆగస్త్య మహాముని పేరు పెట్టడంతో ఇది ప్రసిద్ధి చెందిన తీర్థ యాత్రగా పేరొంది. యాత్ర చేపట్టేవారికి కేరళ ప్రభుత్వం ఆహార సదుపాయాలు కల్పిస్తోంది. ట్రెక్కింగ్ విజయవంతంగా పూర్తి చేసిన సూరజ్‌ను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తానూరు మండలం ఎల్వికి చెందిన సాయినాథ్, లక్ష్మణ్ బైక్‌పై నిర్మల్ వైపు నుంచి భైంసా వైపు వస్తున్నారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల(పాత సరస్వతి కాలేజీ) వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఏరియాస్పత్రికి తరలించారు.

**హాజీపూర్‌లో ఇరువురికి..**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. హాజీపూర్‌లో మంచిర్యాల వైపు వస్తున్న ఓ ట్రాలీ రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు చొప్పదండి మండలం కుర్మపల్లికి చెందిన గొర్రెల కాపరి పెద్ది కొమురయ్యను ఎస్సై సురేశ్ పోలీస్ వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హాజీపూర్ శివారులోని ఓ పైప్‌లైన్ కంపెనీ వద్ద ఆగి ఉన్న సాయి తన బైక్‌లో పెట్రోల్ లేకపోవడంతో రోడ్డుపై నిలిచి ఉన్నాడు. మంచిర్యాల వైపు వెళ్తున్న కర్ణమామిడికి చెందిన కోటె అజయ్ బైక్‌తో వేగంగా ఢీ కొట్టాడు. తీవ్రగాయాలైన అజయ్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.







# పెద్దల సభలో..మనోళ్లు

- ఉమ్మడి జిల్లా నుంచి శాసన మండలికి పలువురి ప్రాతినిధ్యం
- ఛైర్మన్‌గా ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ముకషీర్ షా
- పి.నర్సారెడ్డి, జీవీ సుధాకర్‌రావు, పలువురు ఎమ్మెల్సీగా
- స్థానికసంస్థలు, ఎమ్మెల్యే కోటాలోనే అవకాశాలు



సయ్యద్ ముకషీర్‌షా | పి.నర్సారెడ్డి | జీవీ సుధాకర్‌రావు | సుల్తాన్ అహ్మద్ | ప్రేమ్‌సాగర్ రావు | పొగాకు యాదగిరి | పురాణం సతీశ్ | దండే విఠల్

సాక్షి,ఆదిలాబాద్: మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల, టీచర్స్ శాసనమండలి సభ్యుల ఎన్నికల వేడి ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇటు పట్టభద్రుల పరంగా, అటు టీచర్స్ పరంగా ఒకరంటే ఒక్కరికి కూడా అవకాశం దక్కలేదు. పలువురు పోటీ చేసినప్పటికీ నిరాధారణకు గురయ్యారు. అయితే శాసనమండలి పరంగా ఉమ్మడి జిల్లాలో ఘన చరిత్ర ఉంది. ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ముకషీర్‌షా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలికి 6వ ఛైర్మన్‌గా వ్యవహరించారు. రెండుసార్లు ఆయన ఛైర్మన్‌గా ఉండటం గమనార్హం. ఆ సమయంలో మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, భవనం వెంకట్రాంరెడ్డి, కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎన్టీ రామారావు, నాదెండ్ల భాస్కర్‌రావు సీఎంలుగా ఉన్నారు.

**మనోళ్లు ముఖ్య పదవుల్లో..**

ఉమ్మడి జిల్లా నుంచి శాసనమండలి ఛైర్మన్‌గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ ముకషీర్ షా వ్యవహరించిన ఘనత ఉంది. కాంగ్రెస్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఒక్కసారి ఎన్నిక చేయగా, మరోసారి శాసన పరిషత్‌కు నామినేట్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి 1958లో ఏర్పాటు కాగా, సీఎంగా వ్యవహరించిన ఎన్టీ రామారావు ఈ శాసనమండలి వ్యవస్థను 1985లో రద్దు చేశారు. అప్పుడు మండలి చివరి ఛైర్మన్‌గా ముకషీర్ షా ఉన్నారు. ఆ తర్వాత 2007లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో మళ్లీ శాసనమండలి పునరుద్ధరించారు. నిర్మల్‌కు చెందిన పి.నర్సారెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా వ్యవహరించారు. శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. ఆ తర్వాత ఎంపీ అయ్యారు. అప్పట్లో ఏపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. దండేపల్లికి చెందిన జీవీ సుధాకర్‌రావు ఒకసారి ఎమ్మెల్సీగా వ్యవహరించారు. అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు.

**ఎమ్మెల్యే కోటాలో..**

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన వారిలో ఇప్పటివరకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చెన్నూర్‌కు చెందిన సుల్తాన్ అహ్మద్‌ను మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. అంతకుముందు 1999లో ఈయన సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2004లో మళ్లీ టికెట్ ఆశించారు. ఆ సమయంలో కోనేరు కోనప్పకు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇవ్వగా, సుల్తాన్ అహ్మద్‌కు నామినేట్ పదవి విషయంలో భరోసానిచ్చారు. ఈమేరకే అప్పట్లో ఎమ్మెల్సీగా ఎన్నుకున్నారు. మంచిర్యాలకు చెందిన పొగాకు యాదగిరి న్యాయవాదిగా వ్యవహరించేవారు. ఎన్టీ రామారావు హయాం నుంచి టీడీపీలో ఉన్నారు. చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. వీరిద్దరు మినహా ఎవరు కూడా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించలేదు.

**ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీలు**

1.సయ్యద్ ముకషీర్ షా(మృతిచెందారు). 1979–80, 1981–85 (మండలి ఛైర్మన్), (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు
2.పి.నర్సారెడ్డి (మృతిచెందారు). మూడుసార్లు ఎమ్మెల్యే, కేబినెట్ మంత్రి, ఆ తర్వాత 1981–85 వరకు ఎమ్మెల్సీగా, ఒకసారి ఎంపీగా వ్యవహరించారు.
3.జీవీ సుధాకర్‌రావు (మృతిచెందారు). 1977 (పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు).
4.మహ్మద్ సుల్తాన్ అహ్మద్ (మృతిచెందారు), 2007–09 (ఎమ్మెల్యే కోటా నుంచి ప్రాతినిధ్యం వహించారు)
5. ప్రేమ్‌సాగర్‌రావు, 2007–13 (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు.
6. పొగాకు యాదగిరి (మృతిచెందారు). 2007 (ఎమ్మెల్యే కోటా నుంచి ప్రాతినిధ్యం వహించారు)
7. పురాణం సతీశ్, 2015–22 వరకు (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం)
8. దండే విఠల్.. 2022 నుంచి 2028 వరకు కొనసాగనున్నారు. 'స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం).

**స్థానిక సంస్థల నుంచే..**

ఉమ్మడి జిల్లా స్థానికసంస్థల నుంచే జిల్లా ముగ్గురు నేతలకు అవకాశం దక్కింది. అందులో కాంగ్రెస్ నుంచి సయ్యద్ ముకషీర్ షా, ప్రేమ్‌సాగర్‌రావులు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా వ్యవహరించిన పురాణం సతీశ్ పదవీ కాలం పూర్తయ్యే వరకు పార్టీలోనే కొనసాగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన హస్తం పార్టీలో చేరారు. ప్రస్తుతం అదే పార్టీలో కొనసాగుతున్నారు. 2022లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా గెలిచిన దండే విఠల్ ఇప్పటికీ పదవిలో కొనసాగుతుండగా ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు.

### జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే


ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్: వేలాల జాతర ఏర్పాట్లను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం పరిశీలించారు. గుట్టపై భక్తులకు తాగునీటి వసతి, ఆలయం వద్ద సౌకర్యాలు, గోదావరినదిలో పుణ్యస్నానాలు, గుట్టపైకి కాలినడక మార్గంలో వెళ్లేవారికి తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ నేతృత్వంలో ముగ్గురు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, 30 మంది ఎస్సైలు, 35 మంది ఏఎస్సైలతో పాటు 600 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంచిర్యాల, చెన్నూర్, గోదావరిఖని ప్రాంతాల నుంచి వేలాలకు 100 ఆర్టీసీ బస్సులు కేటాయించారు.

### యంత్రాల పనిగంటలు పెంచాలి


ఇన్‌ఫిట్ క్రషర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనిలో భారీ యంత్రాల పనిగంటలు మరింత పెంచాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) ఎల్వీ.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సందర్శించారు. ఓసీపీలోని ఇన్‌ఫిట్ క్రషర్, సర్ఫేస్ క్రషర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ గని నుంచి ప్రతీరోజు 4రేకుల బొగ్గు రవాణా చేయాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియా మొత్తం 7 రేకుల బొగుగ్ రవాణా కావాల్సి ఉందన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం(సీహెచ్‌పీ) తిరుమల్‌రావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ అధికారి టీ.శ్రీనివాస్, డీజీఎంలు కేశవరావు, రవీందర్, క్వాలిటీ ఇంచార్జి కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు పాల్గొన్నారు.

### మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

తానూరు: మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించిన ఘటన మండలంలో బోంద్రట్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. బోంద్రట్ గ్రామానికి చెందిన పంచశీల మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగివస్తుంది. ఈ క్రమంలో ఎదురుగా బైక్‌పై ముసుగు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో పుస్తెతాడును ఎత్తుకెళ్లి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# యువకుడి దారుణహత్య

- తెల్లవారుజామున కత్తితో గొంతుకోసి..
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- పాత కక్షలే కారణం


రవితేజ (ఫైల్)


రిమ్స్‌లోని మార్చురీ వద్ద మృతుడి కుటుంబీకులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. ముగ్గురు కత్తితో ఆయన గొంతు కోసి పొడిచి చంపిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన కొమ్మువార్ రవితేజ (26) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం భోరజ్ మండలానికి చెందిన ప్రవళికతో వివాహమైంది. రవితేజ చిన్న వయస్సులోనే తండ్రి వదిలిపెట్టి మరో వివాహం చేసుకున్నాడు. ఏడేళ్ల క్రితం తల్లి భాగ్యశ్రీ మృతిచెందింది. కాగా రవితేజ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తిరిగిరాలేదు. పట్టణంలోని ఇందిరానగర్ దత్త మందిర్ సమీపంలో ముగ్గురు యువకులు గోల్డెన్ కార్తీక్, సిద్దూ, సాయికిరణ్ ఆతన్ని కత్తితో పొడిచి హత్య చేశారు. ఈ విషయం మృతుడి భార్యకు స్థానికులు తెలియజేయడంతో ఆమె ఘటన స్థలానికి చేరుకుంది. రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరైంది. మూడు రోజుల క్రితం ముగ్గురు యువకులతో రవితేజకు గొడవలు జరిగాయి. తమ గ్యాంగ్‌తో కలిసి ఉండాలని తన భర్తను హెచ్చరించినట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాత కక్షలతోనే హత్య చేసినట్లు ఆమె పేర్కొంది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**ఆరు గంటల్లోనే కేసు ఛేదించాం: డీఎస్పీ**

గ్యాంగ్‌లు నిర్వహించడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ యువకుడిని హత్య చేసిన కేసును ఆరు గంటల్లోనే ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి కత్తి, మూడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు నేరాలకు పాల్పడుతూ తమతో కలిసి తిరగాలని రవితేజకు చెప్పినా నిరాకరించడంతో హత్యకు ఒడిగట్టినట్లు చెప్పారు. నిందితులు సోమవారం రాత్రి మద్యం తాగి పేకాట ఆడిన తర్వాత ఇందిరానగర్‌లో మరోసారి మద్యం తాగుతున్న సమయంలో రవితేజ బైక్‌పై వెళ్తుండగా అడ్డగించి కత్తితో దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఏ–1గా చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన గోల్డెన్ కార్తీక్, ఏ–2, ఏ–3గా ఇందిరానగర్‌కు చెందిన సిద్దూ, దేవుల సాయికిరణ్‌లు ఉన్నట్లు తెలిపారు. ఏ–1, ఏ–2తోపాటు మృతుడిపై పలు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిపై రౌడీ షీటర్లు ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైన కత్తులతో ఫొటోలు దిగుతూ నేరాలను ప్రేరేపించేలా సోషల్‌మీడియాలో ఫొటోలు, వీడియోలు పోస్టుచేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హత్య చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఆరుగంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన యువకుడు మంగళవారం మృతిచెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యవత్మాల్ జిల్లాలోని ధగడ్‌లాల్ గ్రామానికి చెందిన సట్పుటే దత్తు (22) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఉమర్‌ఖేడ్ తాలుకాలోని కొర్ట గ్రామంలో బంధువుల పంట చేనులో ఈనెల 22న పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

### చోరీకి పాల్పడ్డ దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల చోరీకి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌లో ఈనెల 8న తుమ్మల విజయ ఇంట్లో చోరీ జరిగింది. రూ.5వేల నగదు అపహరణకు గురైంది. బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని నేతాజీ చౌక్‌లో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్ తబ్రేజ్‌ను విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

### ఇంట్లో చోరీ

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో చాదల దత్తాత్రి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. సోమవారం రాత్రి దత్తాత్రి ఇంట్లో నిద్రించాడు. భార్య గోదావరి మరో గదికి తాళం వేసి గ్రామంలో నిర్వహించిన భజన కార్యక్రమానికి వెళ్లి మంగళవారం వేకువజామున వచ్చింది. గదికి వేసిన తాళం పగిలిపోయి ఉంది. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తాళం, గల్లగురిగి ధ్వంసమై కనిపించాయి. శనగ పంట విక్రయించిన రూ.36 వేలు, గల్లగురిగిలో పోగుచేసిన రూ.20 వేలను దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కోతుల దాడిలో మహిళకు గాయాలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లోకు చెందిన మమతపై మంగళవారం కోతుల దాడి చేసి గాయపర్చింది. సోమవారం రాత్రి కుక్కల దాడిలో అదే గ్రామానికి చెందిన ఆశల లచ్చన్న, చిన్నారి వేదశ్రీకి గాయాలయ్యాయి. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఓ మహిళపై కోతులు దాడి చేసి గాయపర్చింది.

### సాగునీటికోసం రైతుల ఆందోళన


నిరసన తెలుపుతున్న రైతులు

దండేపల్లి: కడెం ఆయకట్టు కింద యాసంగి పంటలకు వారబంధీ పద్ధతిలో అందిస్తున్న సాగునీరు సక్రమంగా అందడంలేదని డిస్ట్రిబ్యూటరీ 24బీ పరిధిలోని మాకులపేట, తాళ్లపేట గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కడెం ప్రధాన కాలువలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగికి సాగునీరందిస్తామని అధికారులు చెప్పడంతో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశామని, పంటలకు నీరందక ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ డీఈ వెంకటేశం, ఏఈఈ శ్రావణ్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

# రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


క్రాంతి (ఫైల్)

బెల్లంపల్లి: మద్యానికి బానిసై జల్సాల కోసం అప్పు చేసిన యువకుడు తీర్చేమార్గం లేక రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. కాసిపేట మండల కేంద్రానికి చెందిన దుర్గం క్రాంతి (29) జులాయిగా తిరిగేవాడు. అడపాదడపా మంచిర్యాలకు చెందిన ఓ రియల్టర్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ తెలిసిన వారి వద్ద అప్పులు చేసి మద్యం తాగేవాడు. అవివాహితుడైన క్రాంతి నెలక్రితం తల్లి దుర్గం వెంకటమ్మను బతిమిలాడటంతో ఆమె రూ.10 వేలు వేరే వ్యక్తుల వద్ద అప్పు అడిగి ఇచ్చింది. ఆ డబ్బులను తాగుడుకు ఖర్చు చేశాడు. మరోపక్క అప్పు ఇచ్చిన వారు అడగడంతో తప్పించుకు తిరుగుతున్నాడు. అప్పు తీర్చేమార్గం లేక క్రాంతి సోమవారం అర్ధరాత్రి సుబ్బారావుపల్లి శివారు వైపు వెళ్లి గుర్తుతెలియని రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్గం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### అప్పుల బాధతో ఒకరు..


వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్సై శంకర్

దస్తురాబాద్: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. మండలంలోని గోడిసీర్యాల గోందుగూడ గ్రామానికి చెందిన నామెల్లిపురుక జగన్ (45), రాధ దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. ఆయనకున్న ఎకరం భూమిలో పంట సాగు చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం జగన్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పలువురి వద్ద చేసిన అప్పులు చేసి మద్యం తాగేవాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మంగళవారం ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. ఆ సమయంలో భార్య రాధ పక్కింట్లోకి వెళ్లి తిరిగివచ్చింది. అప్పటికే పురుగుల మందు తాగిన జగన్ భార్యతో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో నోట్లో నుంచి నురుగులు కక్కడంతో 108 సిబ్బందికి సమాచారం అందించింది. వారు అక్కడికి చేరుకుని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గమనించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


పరిశీలిస్తున్న మాజీ ఎంపీ సోయం బాపురావ్, తదితరులు

బజార్‌హత్నూర్: మండలంలోని అనంతపూర్‌లో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కోరెంగ హన్మంతు ఇల్లు దగ్ధమైంది. విద్యుత్ వైరు తెగి ఇంటిపై కప్పుపై పడటంతో మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి మంటలార్పేందుకు యత్నించారు. ఇచ్చోడ నుంచి ఫైరింజన్ అక్కడికి చేరుకుని మంటలార్పివేసింది. తహసీల్దార్ శ్యాంసుందర్ ఆదేశాలతో మంగళవారం ఎంఆర్ఐ నూర్‌సింగ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో రూ.2.50 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, 50 తులాల వెండి, టీవీ, కూలర్, సోఫాసెట్, బెడ్స్, జొన్నలు, గోధుమ పంట, కందులు, బియ్యం, సర్టిఫికెట్లు కాలిపోయాయి. సుమారు రూ. 17 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ సోయం బాపురావ్ అక్కడికి చేరుకుని పరిశీలించి బాధిత కుటుంబానికి రూ.20 వేలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS SERVICE
■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్,ఏఇతర ఫైనాన్స్‌లోఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [H-783412]

WANTED
■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25001803]
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [M-SCA25001809]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462